


# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 08-09-2026 సంపుటి : 08 సంచిక 80 పేజీలు : 8 వెల : రూ 3-00


# ప్రతి ఎకరాకూ నీటితో తెలుగుతల్లికి జలహారతి



**వాటర్ మెన్ గా ఎకనామిక్ టైమ్స్ పేర్కొనటం సంతోషం**
**సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణపై పనిచేయటమే సంతృప్తి**
**పొలిటికల్ గవర్నెన్సుకు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు**
**కష్ట కాలంలో నిలబడిన కార్యకర్తకే పార్టీలో పూర్తి గౌరవం**
**ప్రజల ఓటే మనకు గీటు రాయి..**
**2029లో మెరుగైన ఫలితాలు రావాలి**
**వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు.. ఫ్యాక్ట్ తో కౌంటర్ ఇవ్వండి**
**ఉగ్రవాదుల్లా హిట్ -రన్- హైడ్ విధానంతో గొడ్డలి పార్టీ రాజకీయం**
**టీడీపీ లీడర్షిప్ కాన్ క్లేవ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**
**సాగునీటి రంగంపై చేస్తున్న కృషికి సీఎంకు పార్టీ నేతల స్టాండింగ్ ఓవేషన్**

అమరావతి, సెప్టెంబర్ 07,:- పోలవరం సహా రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చి తెలుగు తల్లికి జలహారతి ఇస్తామని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. వాటర్ మెన్ గా ఎకనామిక్ టైమ్స్ కథనం పేర్కొనటం సంతోషంగా ఉందని .. జల సంరక్షణపై చేస్తున్న కష్టానికి దక్కిన గుర్తింపని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్షిప్ కాన్ క్లేవ్ లో నేతల్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పొలిటికల్ గవర్నెన్సు కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు వెళ్తున్నామని ఆయన అన్నారు. కష్టకాలంలో నిలబడిన కార్యకర్తకు పూర్తి గౌరవం ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల అనంతపురం జిల్లాకు చెందిన సామాన్య కార్యకర్త దళవాయి రమాదేవి దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల ఓటే గీటు రాయిగా పనిచేద్దామని నేతలకు పిలుపునిచ్చారు. 2029లో మరింత మెరుగ్గా ఫలితాలను సాధిద్దామని నేతల్లో ఉత్సాహం నింపారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో తన జన్మ ధన్యమైందని ముఖ్యమంత్రి అన్నారు. కృష్ణా జలాలను చూసి అక్కడి ప్రజల కళ్లల్లో ఆనంద భాష్పాలు వచ్చాయని తెలిపారు. ఎల్ నినో విపత్తుపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజల్ని భాగస్వాములు చేయాలన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు, వెలిగొండ, పోలవరం ఎడమ కాల్వ ప్రారంభోత్సవాల్లో ప్రజలు భాగస్వాములయ్యారని తెలిపారు. జిల్లాలు నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్ ఇచ్చామని పరిపాలనా వెసులుబాటు కోసం ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రతినిధులు సమర్ధ నాయకత్వం వహించాలన్నారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే వారిని ప్రోత్సహిస్తున్నామని పొలిట్ బ్యూరో, చట్ట సభల్లోకి తీసుకు వచ్చామన్నారు. పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్త బలంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీ బలపడటం ఎంత ముఖ్యమూ కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యమని సీఎం దిశానిర్దేశం చేశారు. ఫోటోల గురించి ఫ్లెక్సీల గురించి వివాదాలు వద్దని కూటమిగా కలిసి క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. 2024 కంటే ఎక్కువ ఓట్లు వచ్చేలా పనిచేయాలని అన్నారు. పనిచేయటంతో పాటు చేసిన పనిని సమర్ధంగా ప్రజల్లోకి తీసుకెళ్లటం కూడా ముఖ్యమన్నారు. అంతకు ముందు కాన్ క్లేవ్ లో సీఈఓ సీఎం టూ వాటర్ మాన్ అంటూ ఎకనామిక్ టైమ్స్ రాసిన కథనంపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రికి అభినందన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీకి ప్రాధాన్యం ఇచ్చి తెలుగు యువతను ఐటీ నిపుణులుగా మార్చిన ముఖ్యమంత్రి ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణతో వాటర్ మ్యాన్ గా మారారని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా వివిధ ప్రాంతాలకు జల వనరులు అందించేలా డ్రిప్ ఇరిగేషన్ సహా వివిధ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చారని ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో పేర్కొందని మంత్రి వెల్లడించారు. జలం ఉంటేనే జనం, జలం ఉంటేనే అభివృద్ధి, ప్రగతి అన్న నినాదంతో 2014 రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో పోలవరం, వెలిగొండ లాంటి ప్రాజెక్టులు చేపట్టిన సీఎంకు ఎకనామిక్ టైమ్స్ ప్రశంసలు తెలిపిందని స్పష్టం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాకు నీరు తేవటంతో పాటు రాయలసీమ ప్రాంతానికి హంద్రీనీవా ద్వారా నీరిచ్చారని ఎకనామిక్ టైమ్స్ కథనం తెలిపిందని అన్నారు.

# పార్టీ అప్పగించిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే: మంత్రి లోకేశ



అమరావతి, సెప్టెంబర్ 7 : పార్టీయే సుప్రీం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్‌స్పష్టం చేశారు. పార్టీ పదవుల్లో ఉన్న వారిని మంత్రులైనా.. ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని ఆదేశించారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌లో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. పార్టీ ఏదైనా పని చెబితే.. దానికే ప్రయారిటీ ఇవ్వాలని మంత్రి లోకేశ్ దిశానిర్దేశం చేశారు. క్వాంటం టవర్స్‌కు సంబంధించిన ఓ కార్యక్రమం ఉందని తనను ఆహ్వానిస్తే... పార్టీ తనకో పని అప్పచెప్పిందని... తాను రానని స్పష్టం చేశానని పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే... దానికే హై ప్రయారిటీ ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ పదవుల్లో ఉన్న వారు.. పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడానికి ఎవరి అనుమతి అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న చంద్రబాబు బీ-ఫారం ఇవ్వకుంటే మంత్రులు కాలేరని, ఎమ్మెల్యేలు కారని తేల్చిచెప్పారు. పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదనే విషయాన్ని.. ప్రతి క్షణం గుర్తుంచుకోవాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయనేది.. నిరంతరం సమీక్షించుకుంటూ టీడీపీ కేడర్ వెళ్లాలని సూచించారు. మై-టీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాల వివరాలను పూర్తిగా అప్‌డేట్ చేస్తున్నామని వెల్లడించారు. ఆ సమాచారం ఆధారంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని మంత్రి నారా లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.


# ప్రజలు-ప్రభుత్వానికి వారధిగా నిలవాలి

**టీడీపీ నేతలకు నాయకత్వ శిక్షణ: ఎన్టీఆర్ భవన్‌లో రెండు రోజుల కాంక్లేవ్ ప్రారంభం**
**240 మంది ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు**
**దిశానిర్దేశం చేయనున్న చంద్రబాబు, లోకేశ్**

అమరావతి: క్షేత్రస్థాయి నాయకత్వానికి సరికొత్త దిశానిర్దేశం చేస్తూ తెలుగుదేశం పార్టీ ప్రత్యేక లీడర్‌షిప్ పాలసీకి శ్రీకారం చుట్టింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించే 'లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్' ప్రారంభమైంది. ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతల సామర్థ్యాలకు పదును పెట్టి, ప్రజా సమస్యల పరిష్కారంలో వారిని మరింత క్రియాశీలకం చేయడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.సమగ్ర శిక్షణే లక్ష్యంఈ కాంక్లేవ్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, జాతీయ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సహా మొత్తం 240 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ నేతలకు క్షేత్రస్థాయి కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శనం చేయనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం, కార్యకర్తలతో సమన్వయం, వేగంగా స్పందించే తత్వం, నాయకత్వ లక్షణాల మెరుగుదలపై ప్రధానంగా దృష్టి సారించారు

# ఢిల్లీ హాస్టల్ కూలిన ఘటన..

## త్రుటిలో తప్పిన ప్రమాదం



ఢిల్లీ హాస్టల్ కూలిన ఘటనలో ఓ వీధి వ్యాపారి త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. భవనం కూలడానికి కొన్ని క్షణాల ముందు ముంచుకొస్తున్న ముప్పును గ్రహించి తప్పించుకోగలిగాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.సీసీటీవీ ఫుటేజీలో రికార్డైన దృశ్యాల ప్రకారం, ఓ వ్యక్తి భవనం పక్కనే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో తలపైకెత్తి చూశాడు. భవనం కూలిపోతున్న విషయం గమనించగానే క్షణాల్లో అప్రమత్తమైన అతడు అక్కడి నుంచి పరుగు తీశాడు. ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. అతడు అక్కడి నుంచి కదిలిన మరుక్షణమే భవనం కూలిపోయింది. పెద్ద ఎత్తున దుమ్ముధూళి పైకి లేచింది.పోలీసు వర్గాల కథనాల ప్రకారం, ఆ భవనాన్ని హాస్టల్‌గా వినియోగిస్తున్నారు. బేస్‌మెంట్‌తో పాటు ఐదు అంతస్తులు ఉన్నాయి. బేస్‌మెంట్‌లో నిర్మాణ పనులు జరుగుతుండగా భవనం కూలిపోయిందని పోలీసు వర్గాలు తెలిపాయి. అసలు ఏం జరిగిందనే దానిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ ఘటనలో ఇప్పటికే ఆరుగురు మరణించారు. శిథిలాల కింద మరో 50 మంది వరకూ చిక్కుకుని ఉంటారని సహాయసిబ్బంది భావిస్తున్నారు. ఇప్పటికే 11 మందిని కాపాడారు. మిగిలిన వారిని రక్షించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఢిల్లీలో మంత్రి నాదెండ్ల బిజీబిజీ..

## నిత్యావసర ధరలపై కీలక చర్చలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7: ఢిల్లీ పర్యటనలో ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఔఅఅఈ) మేనేజింగ్ డైరెక్టర్‌ని(ఓఆ) మంత్రి కలిశారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల సరఫరా తీరు, ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజలందరికీ నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. అనంతరం, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేని నాదెండ్ల మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.ఆపై ఢిల్లీ ఏపీ భవన్‌లో సివిల్ సప్లై శాఖ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ స్టోర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీఎన్‌తో నాదెండ్ల మాట్లాడుతూ.. ఢిల్లీలో తెలుగువారి కోసం నాణ్యమైన రైస్ అందించేందుకు



స్టోర్‌ను ప్రారంభించామని తెలిపారు. రేపు కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి పామ్ ఆయిల్, ఉల్లిపాయలు, పప్పు ధరలపై చర్చిస్తామని చెప్పారు. సివిల్ సప్లై శాఖలో అవినీతి జరగకుండా చర్యలు చేపట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.




# సంపాదకీయం

మంగళవారం 08-09-2026

## మళ్లీ మొదటికి నీటి పంచాయితీ

కృష్ణా జలాల్లో వాటాల విషయంలో కొట్లాడుకుంటున్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆరెస్ పార్టీల నేతలు.. అసలు విషయాన్ని పక్కన పెట్టి.. షాడో ఫైట్ చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నీటి వాటాలు ఉన్నా.. వాటిని వినియోగించుకునేందుకు తగిన ప్రాజెక్టులు ఏవని సాగునీటి నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ముందుగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. కేటాయింపుల మేరకైనా నీటిని నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నీళ్ల పంచాయితీ ఇంకా తెగలేదు. కృష్ణా జలాలపై తమ వాటాలపై ఇంకా ఎటూ తేలలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాలను తాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధ కృష్ణా బోర్డు ఆఫీసులో త్రిసభ్య కమిటీ భేటీ అయింది. కృష్ణా బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ రమేశ్‌బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నరసింహమూర్తి సమావేశం అయ్యారు. ఆగస్టు 25న జరిగిన సమావేశంలో చర్చలు కొలిక్కి రాకపోవడంతో బోర్డు సమావేశం వాయిదా పడిన సంగతి తెలిసిందే. తిరిగి శుక్రవారం మరోసారి బోర్డు సమావేశం జరిగినా.. ఎలా ఫలితం తేలకుండానే ముగిసింది. ఈ నెల చివరి వారంలో మరోసారి జరిగే కృష్ణా బోర్డు సమావేశానికి కేఆర్ఎంబీ ఛైర్మన్ బోర్డు అధ్యక్షత వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలోని నీటి నిల్వలను తాగునీటికే వినియోగించాలని మొదటిగా చర్చించారు. కృష్ణా బేసిన్‌లో ప్రజలకు ఎక్కువ భాగం తాగునీటిని సరఫరా చేయాలని, ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాలకు 50% వాటా కింద నీటిని విడుదల చేయాలని తెలంగాణ కోరింది. వచ్చే ఏడాది ఆగస్టు వరకు 200 టీఎంసీలు కేటాయించాలని కోరింది. తమ అవసరాలకు 104 టీఎంసీల కేటాయించాలని ఏపీ.. కృష్ణా బోర్డును కోరింది. ఏపీ, తెలంగాణలకు 66:34 నిష్పత్తిని అమలు చేస్తూ తక్షణమే తమకు 97 టీఎంసీల నీళ్లు విడుదల చేయాలని ఏపీ కోరింది. అయితే ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండడంతో 50 శాతం చొప్పున జలాలు కేటాయించాలని తెలంగాణ కోరింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నారని తెలంగాణ ఆరోపించింది. దీనిపై ఏపీ స్పందిస్తూ న్యాయబద్ధంగా వచ్చిన నీటి నుంచే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా తీసుకుంటున్నట్లు పేర్కొంది. అవసరం లేకున్నా.. తెలంగాణ శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి నీటిని దిగువకు వదులుతోందని పేర్కొంది. దానిని వెంటనే అడ్డుకోవాలని కోరింది. దీనికి తెలంగాణ స్పందిస్తూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ తరలిస్తున్న నీటిని వెంటనే నియంత్రణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో ఇరు రాష్ట్రాలు ఉమ్మడి జలాశయాల నుంచి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్ సూచించారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీటి విడుదలను ఏపీ నియంత్రించాలి. విద్యుదుత్పత్తికి నీటిని విడుదల చేయడాన్ని తెలంగాణ ఆపాలని కోరారని మినిట్స్‌లో తెలియజేశారు. పులిచింత, కేడీఎస్, తుంగభద్రతో సహా అనేక ప్రాజెక్టుల్లో, పెన్నా బేసిన్‌లో 80 టీఎంసీలు ఉన్నాయని తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఉమ్మడి జలాశయాల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని, ప్రస్తుతం ఉన్న నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకే కేటాయించాలని తెలంగాణ వాదించింది. హైదరాబాద్ మహానగరంతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని, ఉమ్మడి జలాశయాల నుంచి 200 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరింది. అలాగే పాత విధానం కాకుండా రెండు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిలో సమానంగా నీటిని పంపిణీ చేయాలని తెలంగాణ ఈఎన్సీ రమేశ్‌బాబు ప్రతిపాదించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తోందని, ఇటీవల ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కూడా అనుమతుల్లేకుండా జలాలను తోడేస్తోందని తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ డిమాండ్‌ను ఏపీ తీవ్రంగా తిరస్కరించింది. ప్రస్తుతానికి తక్షణ అవసరాల కోసం 97 టీఎంసీలను విడుదల చేయాలని కోరారు. తమ వాటా పరిధిలోనే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా నీటిని వాడుకుంటున్నామని స్పష్టం చేస్తూ.. తెలంగాణ డిమాండ్ చేసిన 200 టీఎంసీల కేటాయింపు సహేతుకం కాదన్నారు. పైగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం నుంచి అనవసరంగా దిగువకు నీటిని విడుదల చేస్తోందని, దీనిని తక్షణమే నిలువరించాలని ఏపీ ఫిర్యాదు చేసింది. పోతిరెడ్డిపాడు 19 టీఎంసీలు, చెన్నై తాగునీటి కోసం 15 టీఎంసీలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది అక్టోబరు వరకు 22 టీఎంసీలు తీసుకుంటామని ఏపీ చెప్పిందన్నారు. ఇప్పటికే 20 టీఎంసీలు వాడుకున్నారన్నారు. వెలిగొండ నుంచి కూడా వాడుకుంటూ.. ఇంకా పాత నిష్పత్తిలో నీటి కేటాయింపు కావాలని కోరడం సరికాదన్నారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఏపీకి 104 టీఎంసీలు కావాలని కోరామని ఏపీ ఈఎన్సీ నరహింమూర్తి తెలిపారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలనడం సరికాదన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు కోసం కర్ణాటక ప్రభుత్వం భూసేకరణ పనులు వేగవంతం చేసున్నా.. తెలంగాణ ప్రభు త్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో లేని నీటి వివాదాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని, ఆయన హయాంలో ఏపీ నాయకులు ఎందుకు ఇంత ధైర్యం చేయలేదని ప్రశ్నించారు. వరదలు లేని సమయంలో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడంలో ఆంతర్యమేందని నిలదీశారు.

## త్రిషపై వ్యాఖ్యల నేపథ్యంలో తమిళనాడు సీఎం విజయ్ హెచ్చరిక!



చెన్నై, సెప్టెంబర్ 7: రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలపై ఎలాంటి నిందాపూర్వక, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని సహించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. ఇటీవల నటి త్రిషను ఉద్దేశించి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే వివాదం చెలరేగిన నేపథ్యంలో, విజయ్ శాసనసభలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో కఠినమైన విమర్శలు చేసుకోవడం సహజమేనని, అయితే భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని సీఎం పేర్కొన్నారు. మహిళల గౌరవమే ప్రాధాన్యం: తన సినీ కెరీర్‌లోనూ, ప్రస్తుతం రాజకీయంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంలోనూ మహిళల పాత్ర కీలకమైనదని విజయ్ గుర్తుచేశారు. ఇంట్లో తల్లులు, సోదరీమణులను ఏ విధంగా గౌరవిస్తామో, బయట కూడా అదే గౌరవాన్ని కొనసాగించాలని కోరారు. చట్టపరమైన చర్యలు తప్పవు: ఇటీవల కాలంలో తమిళనాడు రాజకీయాల్లో ద్వంద్వార్థాలు (డబుల్ మీనింగ్స్), అశ్లీల పదజాలంతో మాట్లాడే ధోరణి పెరిగిపోయిందని, మహిళలను కించపరిచేలా ఎవరు మాట్లాడినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. చారిత్రక అంశాల ప్రస్తావన: గతంలో ఇదే శాసనసభలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత అవమానానికి గురైన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి సంస్కృతిని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. కావేరీ నిరసన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవ్వగా, ఆయన ఏ నటి పేరును ప్రస్తావించలేదని డీఎంకే వర్గాలు తెలిపాయి. రాజకీయంగా లబ్ధి పొందడానికే తమ వ్యాఖ్యలను ఎడిట్ చేసి, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించాయి. ఈ అంశంపై శాసనసభ సమావేశాల అనంతరం ఉదయనిధి స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి విజయ్ డీఎంకేపై ఎలాంటి ఆధారాలు లేకుండా లేనిపోని ఆరోపణలు చేశారని విమర్శించారు. అసెంబ్లీలో సీఎం ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు ప్రతిపక్షానికి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఆరోపణలు చేస్తే సరిపోదని, వాటిని నిరూపించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉందన్నారు.

## ఫేక్ వీడియో షేర్ చేయడంపై వివరణ ఇచ్చిన అభిజిత్ దీప్కే



న్యూఢిల్లీ:రామ జన్మభూమి ట్రస్ట్ సీఈవోను ఎక్స్ వేదికగా టార్గెట్ చేస్తూ షేర్ చేసిన వీడియోపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వివరణ ఇచ్చారు. తాను షేర్ చేసిన వీడియో ఫేక్ అని తనకు ముందుగా తెలియదని వెల్లడించారు. 'నేను షేర్ చేసిన వీడియో ఫేక్ అని నాకు తెలియదు. ఏదేమైనా.. ఎవరి వ్యక్తిగత జీవితం వారిది. దానిపై నాకెటువంటి అభ్యంతరాలు లేవు' అని వ్యాఖ్యానించారు. బాబీ డియోల్ నటించిన 'జమాల్ కుడు' పాటకు డాన్స్ చేస్తున్న ఓ వ్యక్తి వీడియోను ఆదివారం అభిజిత్ ఎక్స్‌లో షేర్ చేసి, అతను రామజన్మ భూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రా అని పేర్కొన్నారు. 'వ్యక్తిగత జీవితంలో ఎవరికి నచ్చినట్టుగా వారు ఉండడం తప్పేమీ కాదు. కానీ, ధర్మాన్ని కాపాడేవాళ్లమని చెప్పుకునే వారు దీని గురించి కొంచెం ఆలోచించుకోవాలి. రామజన్మభూమి ట్రస్ట్ సీఈవో ఇలాంటివి చేయకూడదు కదా..' అని పేర్కొన్నారు. అయితే, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుని హోదాలో ఉన్న వ్యక్తి ఓ ఫేక్ వీడియోను షేర్ చేయడమేమిటని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. కాగా, రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ఇటీవలె రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోగా నియమితులయ్యారు. 62 ఏళ్ల మిశ్రా ఎయిర్ ఫోర్స్ విభాగంలో సేవలు అందించి ఎన్నో మెడల్స్ సాధించారు. గత ఏడాది జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో ఆయన వెస్ట్రన్ కమాండ్‌కు సారథ్యం వహించారు.

## దోచుకోవడం దాచుకోవడంపైనే కాంగ్రెస్ దృష్టి: మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

కురవి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై సీరోలులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ.. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఎలా దోచుకోవాలి? ఎలా దాచుకోవాలనే వాటిపైనే దృష్టి సారించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీల అమలుపై ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు అన్ని గ్రామాల్లో బాకీ కార్డులను పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయో ప్రజలకు వివరించాలని సూచించారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాకముందు రూ. 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి, మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయకపోవడంతో పాటు డీఏలు కూడా ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రంలో ప్రతి పనికీ 10 నుంచి 15 శాతం వరకు లంచాలు తీసుకుని పనులు చేస్తున్నారని ఆరోపించారు. డోర్నకల్ ఎమ్మెల్యేను ఉద్దేశించి తాను సీరోలు ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన 'పాడి గేదె' లాంటి వాడినని, ప్రజలు మాత్రం 'దున్నపోతు' లాంటి వ్యక్తికి ఓటు వేసి గెలిపించారని వ్యాఖ్యానించారు. ప్రజలు పాలన, అభివృద్ధి, హామీల అమలును పరిశీలించి భవిష్యత్‌లో నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంపల్లి సొసైటీ మాజీ చైర్‌పర్సన్ కొండపల్లి శ్రీదేవి, కురవి మాజీ వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, నాయకులు బోజ్యానాయక్, పెద్ద వెంకన్న, మామిండ్ల వెంకన్న, జైపాల్‌రెడ్డి, మోహన్‌నాయక్, నరహరి, అనిల్ పాల్గొన్నారు.




## ఇంజిన్ 1లో పడిపోయిన ఆయిల్ స్థాయిలు.. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం వెనక్కి, ఒక ఇంజిన్‌తో ల్యాండింగ్




తిరువనంతపురం: ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం గాలిలో ఉండగా ఒక ఇంజిన్‌లో ఆయిల్ స్థాయిలు వేగంగా పడిపోయాయి. గమనించిన పైలట్లు అప్రమత్తమయ్యారు. ఆ విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఆ ఇంజిన్‌ను ఆఫ్ చేసి మరో ఇంజిన్‌తోనే ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. అయితే పైలట్లు ఎదుర్కొన్న ఈ తీవ్ర పరిస్థితి గురించి అందులోని ప్రయాణికులకు ఏమాత్రం తెలియలేదు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన బోయింగ్ 737 ఫ్లైట్ ఐఎక్స్ 415, కేరళలోని కొచ్చిన్ నుంచి యూఏఈ రాజధాని అబుదాబికి బయలుదేరింది. 50 నిమిషాల ప్రయాణం తర్వాత 36,000 అడుగుల ఎత్తులో విమానం గాలిలో ఉండగా ఇంజిన్ 1లో ఆయిల్ పరిమాణం వేగంగా పడిపోయింది. పైలట్, కో-పైలట్ దీనిని గమనించారు. ఆయిల్ స్థాయిలు ఇంకా పడిపోతుండటంతో వారు అప్రమత్తమయ్యారు. అబుదాబి మార్గాన్ని విరమించుకుని వెనక్కి మళ్లించారు. విమానం తిరిగి కొచ్చిన్‌కు మళ్లుతున్నట్లు ఏటీసీకి తెలియజేశారు. కాగా, ఆ విమానం తిరిగి వెనక్కి ప్రయాణించినప్పుడు అన్ని ప్రామాణిక భద్రతా విధానాలను పైలట్లు పాటించారు. ఇంజిన్ ఆయిల్ స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. విమానం వెనక్కి మళ్లిన సుమారు 45 నిమిషాల తర్వాత ఇంజిన్ 1లో ఆయిల్ ప్రెషర్ హెచ్చుతగ్గులకు గురవ్వడం ప్రారంభమైంది. కాక్‌పిట్ గేజ్‌పై రెడ్ జోన్‌లోకి ప్రవేశించింది. ఇంజిన్ 1లోని ఆయిల్ ప్రెషర్ ప్రమాదకర స్థాయికి పడిపోయినట్లు అది సూచించింది. ఈ నేపథ్యంలో పైలట్లు మరింత అలెర్ట్ అయ్యారు. నాన్ నార్మల్ చెక్‌లిస్ట్‌ను అనుసరించి ఇంజిన్ 1ను ఆపివేశారు. కేవలం ఇంజిన్ 2పై ఆధారపడి కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. మరోవైపు అధిక బరువున్న బోయింగ్ 737 విమానాన్ని ఒకే ఇంజిన్‌తో ల్యాండింగ్ చేయడం అనేది అధిక శ్రమతో కూడుకున్న, అత్యంత ప్రమాదకరమైన విన్యాసం. అయితే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పైలట్లు దానిని సునాయాసంగా పూర్తి చేశారు. కాగా, కాక్‌పిట్‌లో జరిగిన ఈ తీవ్ర పరిణామం గురించి ఆ విమానంలోని ప్రయాణికులకు ఏ మాత్రం తెలియలేదు.

## పీజీ హాస్టల్ బిల్డింగ్ ఓనర్ అరెస్టు .. కొనసాగుతున్న దర్యాప్తు



న్యూఢిల్లీ: సత్యా నికేతన్ బిల్డింగ్ ఓనర్ హరిరామ్ గుప్తాను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని భివాడిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఢిల్లీలో ఆదివారం పీజీ హాస్టల్‌కూలిన ఘటనలో పోలీసులు హరిరామ్ గుప్తాను విచారిస్తున్నారు. అయిదు అంతస్తుల బిల్డింగ్‌లో బాయ్స్ పీజీ హాస్టల్ నడిపిస్తున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలో ఈ బిల్డింగ్ ఉన్నది. అయితే రిపేర్ వర్క్ జరుగుతున్న సమయంలో బిల్డింగ్ కూలింది. ఆ ఘటనలో ఏడుగురు మృతిచెందారు. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బిల్డింగ్ కండీషన్‌తో పాటు రిపేర్ వర్క్ జరిగిన తీరును కూడా విచారిస్తున్నారు.

## 'నాన్న, మీరు గర్వపడేలా చేస్తా'.. కొడుకు చివరి మాటలకు తండ్రి కన్నీరు!

ఢిల్లీ, సెప్టెంబర్ 07: దేశ రాజధాని ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో నిన్న ఐదంతస్తుల భవనం కూలిన ఘటన అందరినీ తీవ్రగ్భ్రాంతికి గురి చేసింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు మృతి చెందారు. వారిలో మధ్యప్రదేశ్‌కు చెందిన అక్షత్ సింగ్ అనే విద్యార్థి ఒకరు. అతడు ఢిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ) పీజీడీఏవీ కాలేజ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొడుకు మరణ వార్త తెలిసి మధ్యప్రదేశ్ కట్నీలో నివాసం ఉంటున్న అక్షత్ కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. కుమారుడి మృతదేహాన్ని చూసి అక్షత్ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించిన తీరు అక్కడ ఉన్నవారిని కూడా కంటతడి పెట్టించింది. ఇక అక్షత్ సోదరి అయితే తమ్ముడి మృతదేహం చూసి.. స్పృహ కోల్పోయారుఅక్షత్ తండ్రి రాజస్థాన్‌లోని కోటాలో పనిచేస్తుండగా, తల్లి గృహిణి. అతడు చదువులో ముందుంటాడని, పుస్తకాలు చదవడం, క్విజ్ పోటీల్లో పాల్గొనడం అంటే అతనికి ఎంతో ఇష్టమని కుటుంబ సభ్యులు తెలిపారు. ఖాళీ సమయం దొరికితే పుస్తకాలు కొనేవాడని, సివిల్స్ పరీక్షలు రాసి ఐఏఎస్ కావాలనేది అతని కోరిక అనే అక్షత్ బంధువులు వెల్లడించారు. 'నాన్నా, భవిష్యత్ లో ఒక రోజు నేను పెద్ద ఆఫీసర్‌నై నిన్ను గర్వపడేలా చేస్తా' అని తనకు తరచూ చెప్పే వాడంటూ ఈ మాటలు గుర్తు చేసుకుని అక్షత్ తండ్రి కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఈ ఘటన జరగడానికి రెండు రోజుల ముందే అక్షత్ తన తల్లితో వీడియో కాల్‌లో మాట్లాడాడు. అవే చివరి మాటలు అవుతాయని ఆ తల్లి కలలో కూడా ఊహించలేదు. 'నవమాసాలు మోసి, పెంచి పెద్దచేసిన బిడ్డ విగతజీవిగా పడివుండటం చూసి తట్టుకోలేకపోతున్నాను' అంటూ అక్షత్ తల్లి గుండెలు పగిలేలా రోధించింది. ఇటీవలే రాఖీ పండుగకు ఇంటికి వెళ్లిన అక్షత్ సోదరికి రక్షబంధన్ కట్టి తిరిగి ఢిల్లీ చేరుకున్నాడు. ఇంతలోనే భవనం కూలిన ఘటనలో విగత జీవిగా మారాడు. అక్షత్ తండ్రి ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉండే ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భవనాలను ఎందుకు తనిఖీ చేయరని ఆయన ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యమే తన బిడ్డ ప్రాణాలను బలితీసుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# పాదయాత్రల కౌంటర్...



విజయవాడ, సెప్టెంబర్ 7,ఏపీ రాజకీయాలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న తెగువ మామూలుగా లేదు. ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా కొనసాగుతూనే.. ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్లాన్లకు ఎక్కడికి అక్కడ చెక్ పెడుతున్నారు. తాజాగా జగన్ పాదయాత్ర చేస్తారని వైసిపి తెగ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దానికి ప్రారంభంలోనే లోకేష్ చెక్ పెట్టారు.2027 లో వాస్తవానికి ఏపీలో ఎన్నికలు జరగవు. అయితే 2027 లోనే పాదయాత్ర చేస్తానని జగన్ ఇప్పటికే ప్రకటించినట్టు తెలుస్తోంది. సరిగ్గా 2017 నవంబర్ 6న ఆయన పాదయాత్ర చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లను గెలుచుకొని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఈసారి కూడా అదే ఫార్ములా రిపీట్ అవుతుందని జగన్ భావిస్తున్నారు. ఒకరకంగా ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందుగానే జగన్ పాదయాత్రకు ప్రణాళిక రూపొందించడం విశేషం.గతంలో ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందుగానే పాదయాత్ర ఫిక్స్ చేస్తే.. ఈసారి దాన్ని రెండు సంవత్సరాలకు ముందుగానే పొడిగించారు. గతంలో జగన్ 3700 కిలోమీటర్ల దాకా పాదయాత్ర చేశారు. ఈసారి ఏకంగా 5000 కిలోమీటర్లను టార్గెట్ గా పెట్టుకున్నారు. ఈసారి పూర్తిగా గ్రామాల మీదుగా వైయస్ జగన్ పాదయాత్ర సాగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎన్నికలకు రెండు సంవత్సరాలు ముందుగానే అంటే దాదాపు 730 రోజులు.. ఒకవేళ మధ్యలో జగన్ విశ్రాంతి తీసుకున్న సరే రోజుకు మూడు గ్రామాలను కవర్ చేయాలని వైసిపి నేతలు డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. వైసిపికి గ్రామీణ ప్రాంతాలలో ఓటు బ్యాంకు ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాలలోనే అధికంగా అమలు చేసినట్టు వారు గుర్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు.. ఇతర సమీకరణాలు తనకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు.కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ నేతలు అంటున్నారు. అయితే ఇప్పుడు టిడిపి అంతకు మించిన ప్రణాళికతో ఉంది. కేవలం వైసీపీ మీద ఉన్న నెగిటివిటీని మాత్రమే కాకుండా.. అమరావతి.. రాజధాని అభివృద్ధి.. మౌలిక సదుపాయాలు.. సాగునీటి ప్రాజెక్టులు వంటి వాటిని ప్రధానంగా ప్రచారం చేసుకుంటున్నది. మెరుగైన సంక్షేమం అందిస్తున్నామని ఇప్పటికే టిడిపి వివిధ వేదికలలో వైసిపి కి చెక్ పెట్టే విధంగా ప్రచారం చేస్తోంది. వైసీపీ ప్రణాళికలకు గట్టిగానే దెబ్బకొట్టే విధంగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమానికి ఎక్కువ ఇస్తామని వైసిపి చెబితే ప్రజల్లో కొత్త సానుకూలత వచ్చే అవకాశం ఉంది. అయితే కేవలం సంక్షేమ మాత్రమే కాకుండా.. అభివృద్ధి ఎజెండాను కూడా వైసిపి చూపించాల్సి ఉంటుంది.ఏపీ రాజధాని విషయంలో వైసిపికి ఇప్పటికి ఒక క్లారిటీ లేదు. గతంలో మూడు రాజధానులు అన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం అన్నారు. ఇప్పుడేమో మావిగన్ అంటున్నారు. ఒకవేళ మావిగన్ గురించి వైసిపి ఇప్పటికంటే ఎక్కువ ప్రచారం చేసినప్పటికీ.. అప్పటికే అమరావతి మొదటి దశ పూర్తవుతుంది. అలాంటప్పుడు వైసిపి మావిగన్ గురించి డప్పు కొట్టి చెప్పిన ప్రయోజనం ఉండదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏపీలో సాగునీటి ప్రాజెక్టులను వరుసగా ప్రారంభించుకుంటూ వెళ్తోంది. అంతేకాదు, పోలవరం కూడా పూర్తి చేస్తామని చెబుతోంది. ఎన్నికల నాటికి కొన్ని కీలకమైన ప్రాజెక్టులు కూడా పూర్తవుతాయని కూటమి నేతలు అంటున్నారు. అలాంటప్పుడు జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎలాంటి విమర్శలు చేస్తారు.. క్రెడిట్ చోరీ అంటూ ఒకవేళ జగన్ విమర్శలు చేసినప్పటికీ ఉపయోగము ఉండదు.జగన్ చేస్తున్న పాదయాత్రకు కౌంటర్ గా.. ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా పాదయాత్ర చేస్తారని.. జగన్ పర్యటించిన ప్రాంతాలకు దగ్గరగానే లోకేష్ పాదయాత్ర కూడా సాగుతుందని కూటమినేతలంటున్నారు. జగన్ కూటమి ప్రభుత్వం మీద చేసే ప్రతి విమర్శకు లోకేష్ గట్టిగా బదులు చెబుతారని.. దీనికి సంబంధించి గట్టిగానే బ్లూ ప్రింట్ రూపొందించారని సమాచారం. సాధారణంగా ప్రతిపక్షం పాదయాత్ర చేస్తూ ఉంటుంది. కానీ ఏపీలో వైసిపికి ప్రతిపక్ష హోదా లేదు. కానీ ఇక్కడ చిత్రంగా అధికార పక్షంలో ఉన్న టిడిపి పాదయాత్ర చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే 2027 లో ఏపీ రాజకీయాలలో పెను ప్రకంపనలు చెలరేగడం ఖాయం.

## వడివడిగా లోకల్ బాడీ ఎన్నికల ఏర్పాట్లు

విజయవాడ, సెప్టెంబర్ 7,ఏపీ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు.. ఓటర్ల జాబితా.. ఇతర వ్యవహారాలను ఎన్నికల సంఘం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలవేళ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. అధికారులకు ఆయన కీలక ఆదేశాలు కూడా జారీ చేశారు. దీంతో చాలామందికి పదవులు రాబోతున్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల అభిప్రాయంతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా జిల్లాలు ఏర్పాటు చేశారు. అంతటితోనే ఆగిపోయారు. శాశ్వతమైన నిర్మాణాలు.. బలమైన కార్య నిర్వాహక వ్యవస్థ.. కొత్త పదవుల భర్తీ వంటివి చేయలేకపోయారు .జగన్ చేయలేక పోయిన పనిని ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు. ఏపీ రాష్ట్రంలో ప్రస్తుతం 13 జెడ్పీలు మాత్రమే ఉన్నాయి. వీటిని 28 చేయాలని ఇటీవల చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. చంద్రబాబు నిర్ణయం మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ పరిపాలన కాలంలో మార్కాపురం.. పోలవరం జిల్లాలకు కూడా కూటమి ప్రభుత్వం జడ్పీలను ఏర్పాటు చేసింది. అంతేకాదు కొత్త జిల్లా పరిషత్తుల నిర్వహణ కోసం ఏకంగా 30 కీలకమైన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. దీనికి తోడు అదనంగా 15 జడ్పీ సీఈవో.. 15 డిప్యూటీ సీఈవో పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. సెప్టెంబర్ 24 తో ప్రస్తుతం కొనసాగుతున్న జెడ్పి పాలకవర్గాల పదవీకాలం పూర్తవుతుంది. ఇది పూర్తి అయిన వెంటనే 28 కొత్త జడ్పీ ల వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. అంతేకాదు ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు 660 మండలాలను కొత్త జిల్లా పరిషత్ పరిధిలోకి మ్యాపింగ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.జెడ్పిల పనితీరు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ముందు చూపుతో ఉన్నారు. వివాదాస్పద.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కాకుండా కొత్త జడ్పీ లకు ప్రస్తుతం ఉన్న పారదర్శకమైన సిబ్బందిని ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది. పురపాలక ఎన్నికలు పూర్తి కాకముందే జిల్లా పరిషత్ లకు సంబంధించిన పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో కొత్త జిల్లాలవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ముఖ్యమంత్రి నిర్ణయంతో పరిష్కారం కాబోతున్నాయి. ఆశావాహుకులకు కొత్తగా పదవులు కూడా దక్కబోతున్నాయి. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ముఖచిత్రం కూడా మారనుంది.

## రాజకీయాలకు అయ్యన్న గుడ్ బై...

విజయవాడ, సెప్టెంబర్ 7, ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు మొత్తానికి రాజకీయాలలో ఒక సంచలనమైన నాందికి శ్రీకారం చుట్టారు. ప్రతి విషయాన్ని కుండబద్దలు కొట్టే విధంగా చెప్పే అయ్యన్న.. చివరికి తన రాజకీయ భవితవ్యంపై కూడా కీలకమైన నిర్ణయం తీసుకున్నారు.వాస్తవానికి దేశవ్యాప్తంగా ఏ నాయకుడైనా సరే రాజకీయాలకు వచ్చిన తర్వాత.. రిటైర్మెంట్ అనేది తీసుకోకుండా ఉంటారు. చివరికి కాటికి కాలు చాపే వయసు వచ్చినప్పటికీ కూడా అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు. అప్పట్లో బీహార్ రాష్ట్రంలో లాలు ప్రసాద్ యాదవ్ ఆస్పత్రిలో ఉన్నా కూడా ముఖ్యమంత్రి పదవిని వదులుకోలేదు. అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుకు వెళ్లినప్పటికీ కూడా.. తన భార్యను ముఖ్యమంత్రిని చేసి.. రాజకీయాలలో ఫ్యామిలీ ప్యాకేజీ వ్యవహారం ఎలా ఉంటుందో ఆయన నిరూపించారు.కేవలం లాలూ ప్రసాద్ యాదవ్ మాత్రమే కాదు మన తెలుగు నాటకూడా ఈ



తరహా రాజకీయ నాయకులకు కొదవలేదు. అయితే అటువంటి సాంప్రదాయం కొనసాగుతున్న నేపథ్యంలో ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. 2029లో ఏపీ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. అప్పటికి అయ్యన్నపాత్రుడికి 73 సంవత్సరాలు వస్తాయి. కాబట్టి తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అంతేకాదు.. అప్పటికి ఒకవేళ తాను రాజకీయాలలో కనుక ఉండి ఉంటే.. తినడం కష్టమవుతుందని పేర్కొన్నారు.అయ్యన్న తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా టిడిపిలో చాలామంది సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే యువకులకు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని టిడిపి భావిస్తోంది. ఈ నేపథ్యంలో అయ్యన్నపాత్రుడు తనకు 73 సంవత్సరాల వయసు వస్తుంది కాబట్టి అప్పటికి తాను రాజకీయాల్లోకి ఉండడం కరెక్ట్ కాదని ఆయన భావిస్తున్నారు.

## కులాల చుట్టే పోలరైజేషన్...

కాకినాడ, సెప్టెంబర్ 7,ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను పరిశీలిస్తే కుల సమీకరణాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయనే అభిప్రాయం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు ఈ ప్రభావం మరో రూపంలో కనిపిస్తోంది. ముఖ్యంగా యువతలో రాజకీయ ఆసక్తి పెరగడం ఒకవైపు సానుకూల పరిణామంగా కనిపిస్తున్నప్పటికీ, సామాజిక వర్గాల ఆధారంగా వారు విడిపోతున్న తీరు మాత్రం చర్చకు దారితీస్తోంది.గతంలో కులం, రాజకీయాల విషయంలో పెద్దల మధ్య ఎక్కువగా చర్చలు జరిగేవి. యువత మాత్రం వాటికి కొంత దూరంగా ఉండేది. తమ చదువు, ఉద్యోగం, వ్యక్తిగత భవిష్యత్తుపైనే ఎక్కువగా దృష్టి పెట్టేది. కానీ సామాజిక మాధ్యమాలు విస్తరించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. రాజకీయ నాయకుల ప్రసంగాలు, అభిమాన సంఘాల కార్యక్రమాలు, సోషల్ మీడియా పోస్టులు నేరుగా యువతను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో తమకు నచ్చిన పార్టీ లేదా నాయకుడి పట్ల కొందరు యువకులు తీవ్ర అభిమానాన్ని ప్రదర్శిస్తున్నారు.రాజకీయ చైతన్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మంచిదే. యువత విధానాలను ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరుపై చర్చించడం, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం ఆరోగ్యకరమైన పరిణామాలే. కానీ రాజకీయ అభిమానం సామాజిక వర్గ గుర్తింపుతో కలిసిపోయినప్పుడు పరిస్థితి మరో విధంగా మారే అవకాశం ఉంటుంది. ఒక నాయకుడిని ఆయన విధానాల కోసం కాకుండా తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా మాత్రమే చూడటం రాజకీయ చర్చను సంకుచితం చేస్తుంది.ఇటీవల ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి జన్మదిన వేడుకల సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో యువత పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడం ఈ చర్చకు మరింత బలం ఇచ్చింది. బైక్ ర్యాలీలు, భారీ సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలతో అభిమానాన్ని చాటుకున్నారు. చదువుకునే ప్రదేశాలు, పనిచేసే చోట్ల కూడా ఒకే సామాజిక నేపథ్యానికి చెందిన వారు సమూహంగా ఏర్పడి వేడుకలు నిర్వహించిన సందర్భాలు కనిపించాయి. సహజమైన అభిమానాన్ని మించి భావోద్వేగం కనిపించడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది.ఒక నాయకుడిపై అభిమానం ఉండటం తప్పు కాదు. అదే అభిమానం ఇతర పార్టీలను లేదా సామాజిక వర్గాలను తక్కువగా చూడటానికి దారితీయకూడదు. సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిపై దూషణలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా భావించడం వంటి ధోరణులు యువతలో పెరగడం మాత్రం ఆందోళన కలిగించే అంశమే. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజం. వాటిని గౌరవించడం కూడా రాజకీయ సంస్కృతిలో భాగమే.ఇక యువత ఒక నిర్దిష్ట సామాజిక వర్గం చుట్టూ రాజకీయంగా సమీకృతమైతే భవిష్యత్ ఎన్నికల్లో దాని ప్రభావం ఎలా ఉంటుంది అనేది ఆసక్తికరంగా మారింది. రాజకీయ పార్టీలు కూడా యువత మద్దతును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే యువతను కులం, ప్రాంతం లేదా వ్యక్తిగత అభిమానాలకు పరిమితం చేయకుండా విధానాలు, అభివృద్ధి, ఉపాధి, విద్య వంటి అంశాలపై ఆలోచించేలా చేయడం అవసరం. అప్పుడే యువ రాజకీయ చైతన్యం సమాజానికి బలంగా మారుతుంది.

## పవన్ వరుస గైర్హాజర్లు... కారణం ఏమిటీ

ఒంగోలు, సెప్టెంబర్ 7, కూటమి ప్రభుత్వంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరచూ కేబినెట్ సమావేశాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా గురువారం జరిగిన మంత్రివర్గ భేటీకి కూడా ఆయన హాజరు కాలేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కేరళ లో ప్రకృతి ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో ఈ గైర్హాజరుకు ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని తెలుస్తోంది. అయితే గతంలో కూడా కొన్ని సమావేశాలకు ఆయన రాకపోవడం, మరికొన్ని సందర్భాల్లో సమావేశానికి హాజరై అనారోగ్య కారణాలతో మధ్యలోనే వెళ్లిపోవడం జరిగింది.టీడీపీ -జనసేన -బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు సుమారు 50 వరకు కేబినెట్ సమావేశాలు జరిగాయని, వాటిలో పవన్ కొన్ని సమావేశాలకు గైర్హాజరయ్యారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ 3 వరకు దాదాపు 15 మంత్రివర్గ సమావేశాలు జరిగితే, వాటిలో చాలా తక్కువ సమావేశాలకే ఆయన హాజరయ్యారని ప్రచారం జరుగుతోంది. సుమారు 11 భేటీలకు ఆయన దూరంగా ఉన్నారని కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ సంఖ్యకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.పవన్ కళ్యాణ్‌కు ఇటీవల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉండటం కూడా ఈ పరిణామాలకు కారణంగా కనిపిస్తోంది. కొంతకాలం క్రితం ముంబై లోని ఆసుపత్రిలో ఆయన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ తర్వాత కూడా నొప్పి పూర్తిగా తగ్గకపోవడంతో విశ్రాంతి, చికిత్స కోసం కేరళకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని సహజంగానే చూడాలని కూటమి వర్గాలు భావిస్తున్నాయి.అయితే రాజకీయంగా మాత్రం ఈ అంశంపై భిన్నమైన చర్చలు మొదలయ్యాయి. పవన్ గైర్హాజరు పూర్తిగా ఆరోగ్య కారణాల వల్లేనా? లేక ఇందులో రాజకీయ కోణం కూడా ఉందా? అనే సందేహాలను కొందరు విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులకు కూడా పవన్ గతంలో క్రమం తప్పకుండా హాజరయ్యేవారని, ఇటీవల మాత్రం ఆయన పాల్గొనడం తగ్గిందని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది.ఒక కేబినెట్‌లో కీలకమైన శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి వరుసగా సమావేశాలకు దూరంగా ఉండటం సాధారణ విషయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ కేవలం మంత్రి మాత్రమే కాకుండా ఒక రాజకీయ పార్టీకి అధినేత కావడంతో ఆయన గైర్హాజరుపై సహజంగానే ఎక్కువ దృష్టి పడుతోంది. అయితే ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని కూటమి నాయకత్వం దీనిని సానుకూలంగానే చూస్తున్నట్లు తెలుస్తోంది.పవన్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడి సెప్టెంబర్ 10న కేరళ నుంచి తిరిగి వస్తారని సమాచారం. ఈ నెలలోనే మరో కేబినెట్ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆయన అందులో పాల్గొంటారా లేదా అనే ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఆయన తిరిగి చురుకుగా ప్రభుత్వ కార్యకలాపాల్లో పాల్గొంటే ఈ గైర్హాజరుపై కొనసాగుతున్న రాజకీయ చర్చలకు కూడా కొంతవరకు తెరపడే అవకాశం ఉంది.

## వ్యవసాయ కూలి నుంచి లేడీ డాన్ వరకు..

తిరుపతి, సెప్టెంబర్ 7, చిన్న గదిలో ఉంటూ.. వ్యవసాయ కూలీగా జీవితం మొదలుపెట్టిన ఓ మహిళ మాజీ మంత్రి కీలక అనుచరుడి సాయంతో లేడీ డాన్‌గా ఎదిగింది. ఆమె మదలనపల్లెకు చెందిన కోనేటి సులోచన. స్థానికంగా 'లేడీ డాన్'గా చలామణి అవుతూ అనేక అక్రమాలకు పాల్పడింది. శనివారం కోనేటి సులోచన ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడితో చేతులు కలిపి వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కాజేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో.. కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సీఐలు మోహన్ కుమార్, రాజారెడ్డి, మహమ్మద్ రఫీలతో కూడిన మూడు టీమ్‌లు నిర్వహించాయి. సులోచన నివాసంతో పాటు ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీల్లో 50 రకాల కీలక ఆస్తి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 15 ఫోర్జరీ సంతకాలు చేసి ఉంచిన పాత ఖాళీ బాండు పేపర్లు బయటపడ్డాయి. అప్పులు ఇచ్చినట్లు నమ్మించి, వారి నుంచి బలవంతంగా ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకుని ఆస్తులు లాక్కోవడానికి వీటిని ఉపయోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సులోచన పేరుపై బండకమ్మమిదపల్లెలో రూ.60 కోట్ల విలువైన 502 చదరపు గజాల స్థలం, బిల్డింగ్, పొన్నూటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును ఉపయోగించి 10 కోట్ల విలువైన 47 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమిని మాజీ మంత్రి భార్య పేరిట 2023 జూన్‌లో గిఫ్ట్‌డీడ్‌గా మార్చినట్లు గుర్తించారు. గతంలో కోట్ల విలువైన భూములను అక్రమంగా రాయించుకున్నారని బాధితులుచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మదనపల్లె లేడీ డాన్ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే పోలీసుల తనిఖీలు చేస్తున్న క్రమంలో సులోచన ఇంట్లో లేదు. ఆమె విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. సులోచన ఇంట్లో స్వాధీనం చేసుకున్న పత్రాల వివరాలను ఇంట్లో ఉన్న ఆమె పిల్లలకు అందజేశారు. బాధితుడు మార్పు వెంకటేష్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించనట్లు సమాచారం. లేడీడాన్ సులోచనపై మదనపల్లె ఒకటో, రెండో పట్టణ, పోలీసు స్టేషన్లలో 14 క్రిమినల్ కేసులు, రౌడీషీట్ ఉండడం గమనార్హం.

## స్వదేశ్ దర్శన్ పేరుతో బుద్ధిస్ట్ ఎక్స్ పీరియన్స్

శ్రీకాకుళం సెప్టెంబర్ 7,స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్ధిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలు, గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు, నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్ట్ ప్లేస్‌లుగా పేరొందిన కొన్ని ప్రదేశాలను మరింత అందంగా మార్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.అరకు, అరసవల్లి, గన్నవరం, వేదగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన టెండర్లకు కూడా ఆహ్వానించింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్దిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరు ధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 107.94 కోట్లతో అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున చారిత్రక డచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు.గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు కిలోమీటర్ దూరం సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ. 176 కోట్లతో గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రూ. 34.29 కోట్లతో ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీపట్నంలో కోస్ట్ ఎక్స్‌పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎకో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్ వంటి సదుపాయాల కల్పన ఉన్నాయి.

## తిరుపతిలో ట్రావెల్స్ మేనేజర్ పై రౌడీ షీటర్ దాడి

తిరుపతితిరుపతి లో ఒక ట్రావెల్స్ మేనేజర్ పై రౌడీ షీటర్ దాడికి దిగారు. బాధితుడి ఫోన్ పగలగొట్టి, మెడలో గోల్డ్ చైన్ లాక్కొని చంపేస్తానంటూ బెదిరింపులకు గురి చేసారు. చెర్లోపల్లి ఆయన్ డిజిటల్ ఎగ్జామినేషన్ సెంటర్ సమీపంలో ఘటన జరిగింది. సుండుపల్లి మండలం మంచిరెడ్డిపల్లికి చెందిన చంద్రమోహన్ పుదీపట్ల కృష్ణ ట్రావెల్స్ లో మేనేజర్ . ఈనెల 4న రోడ్డుపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వారికి హారన్ కొట్టాడని అడ్డగించి దాడికి దిగారు. నా పేరు అజీమ్, నేను రౌడీషీటర్, మిమ్మల్ని చంపేస్తా అంటూ దాడి చేసి మెడలోని 9 గ్రాముల బంగారు చైను లాక్కున్నాడు. బాధితుడు పి.చంద్రమోహన్ తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. కొర్లగుంట కొత్తపల్లికి చెందిన రౌడీ షీటర్ సయ్యద్ అజీమ్, తిరుపతి రూరల్ అవిలాలకు చెందిన గోశాల రుద్ర ను పోలీసులు అరెస్టు చేసారు. వినయ్ అలియాస్ బబ్లు కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# శ్రీకృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణకు తరలిరండి--

## 13న నంద్యాలలో విగ్రహావిష్కరణ-

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 07: నంద్యాలలో నిర్మాణం అవుతున్న మహనీయుడు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 13న ఆదివారం ఉదయం 10 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు నంద్యాల బలిజ సంఘం, కాప్స్ రాక్స్ సభ్యులు తెలిపారు. శ్రీకృష్ణదేవరాయుల గొప్పతనాన్ని, తెలుగు సంస్కృతి, సాహిత్యం, కళలకు ఆయన చేసిన సేవలను స్మరించుకునే ఈ కార్యక్రమానికి బలిజ సోదరులు, కాప్స్ రాక్స్ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమాజమంతా ఐక్యంగా పాల్గొని విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు నంద్యాల బలిజ సంఘం, కాప్స్ రాక్స్ ప్రతినిధులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, కామిని మల్లికార్జున ఇరువురు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



# అన్న క్యాంటీన్ల తనిఖీ--

## శానిటేషన్ పనులపై కమిషనర్ శేషన్న ప్రత్యేక దృష్టి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 07-పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, అన్న క్యాంటీన్ల పనితీరుపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న పట్టణంలోని అన్న క్యాంటీన్లను తనిఖీ చేసి, అక్కడి నిర్వహణ, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యాంటీన్లలో పరిశుభ్రత, నిర్వహణ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న శానిటేషన్ పనులను కమిషనర్ పరిశీలించారు. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్యానికి ఇబ్బంది కలిగించే పరిస్థితులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధరల భారానికి వ్యతిరేకంగా ఆందోళన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 07-: ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 9న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఆందోళనలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పిలుపునిచ్చారు. 2014 నుంచి నిత్యావసర వస్తువులు, పప్పులు, వంటనూనె, పాలు, చక్కెర, కూరగాయల ధరలు పెరిగి సామాన్య కుటుంబాలపై తీవ్ర భారం పడిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోగా, వినియోగదారులు అధిక ధరలు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. మధ్యవర్తులు, దళారీలు, నిల్వదారుల దోపిడీని అరికట్టాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ధరల దోపిడీకి వ్యతిరేకంగా జరిగే ఆందోళనల్లో సీపీఐ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రంగనాయుడు కోరారు.



# మహానందిలో నంది ప్రదోషం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 7: మాసోత్సవాల్లో భాగంగా నందీశ్వరుడు జన్మించిన మహానంది క్షేత్రంలో మంగళవారం నంది ప్రదోషం సందర్భంగా ప్రదోషకాల నందీశ్వరాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. శ్రావణ బహుళ త్రయోదశి, శ్రావణ మంగళవారం, మహాప్రదోష కాలం కలిసి రావడంతో ఈ రోజుకు విశేష ప్రాధాన్యత ఉందని ఆలయ వర్గాలు తెలిపారు. అభిషేక సేవలో పాల్గొనదలచిన భక్తులు మంగళవారం సాయంత్రం 4 గంటలకు సేవా రుసుముతో ఆలయం వద్దకు హాజరు కావాలని సూచించారు.



# కొత్త పింఛన్లకు గ్రీన్‌సిగ్నల్--

## సెప్టెంబరు 16 వరకు దరఖాస్తుల స్వీకరణ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 7: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద అర్హులైన కొత్త లబ్ధిదారుల నుంచి సెప్టెంబరు 7 నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియపై ఆమె దిశానిర్దేశం చేశారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఆధార్, రైస్‌కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత పింఛన్ కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన సెప్టెంబరు 17 నుంచి 21 వరకు, క్షేత్రస్థాయి పరిశీలన 22 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. తుది పరిశీలన, బడ్జెట్ ప్రతిపాదనలను సెప్టెంబరు 25, 26 తేదీల్లో చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అర్హులైన వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల పరిశీలనను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రామునాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# పిజిఆర్ఎస్ దరఖాస్తులకు సత్వర పరిష్కారం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 7: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌కు 263 దరఖాస్తులు అందాయని తెలిపారు. దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పెండింగ్ సమస్యలను వేగంగా పరిష్కరించాలన్నారు. రీఓపెన్ అయిన దరఖాస్తుల్లో 66 ఇంకా పరిష్కరించాల్సి ఉందని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 131 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు సమర్పించిన ప్రతి వినతిని బాధ్యతగా తీసుకుని సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, ఆర్డీఓ విశ్వనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# మహిళల ఉత్పత్తులకు వనస్య వేదిక--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 07: మహిళలు, గిరిజన మహిళలు తయారు చేస్తున్న సహజసిద్ధమైన ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయం కల్పించి, వారి జీవనోపాధిని బలోపేతం చేయడమే లక్ష్యంగా 'వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లాధికారులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ మహిళలు, స్థానిక ఉత్పత్తిదారులకు స్థిరమైన ఆదాయ అవకాశాలు కల్పించేందుకు వనస్య కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాల మేరకు జిల్లాలో తయారయ్యే ఉత్పత్తులకు మార్కెటింగ్ వేదికగా దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రంలో డీఆర్‌డీఏ, మెప్మా, చేనేత, ఉద్యానవన, ఎంఎస్ఎంఈ, అటవీ శాఖల ఆధ్వర్యంలో మహిళా సంఘాలు, గిరిజన మహిళలు తయారు చేసిన వివిధ సహజ ఉత్పత్తులను విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ప్రజలు కేంద్రాన్ని సందర్శించి ఉత్పత్తులను కొనుగోలు చేయడంతో పాటు అవసరమైన వారు పెద్ద మొత్తంలో ఆర్డర్లు ఇవ్వవచ్చన్నారు. 'వన్ ఫ్యామిలీ?వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్య సాధనకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్రం ఏర్పాటుకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులు, స్వచ్ఛంద సంస్థ సహకారం అందించినట్లు తెలిపారు. మహిళల ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు.



# భూ సమస్యలకు సత్వర పరిష్కారం--

## ఆరు నెలల్లో 367 మంది రైతులకు 965 ఎకరాల పరిష్కారం---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 7: రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మహానంది మండలానికి చెందిన 88 మంది రైతులకు సంబంధించిన 197 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి, ప్రొసీడింగ్స్ కాపీలను అందజేశారు. 22ఏ నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపు, డాటెడ్ ల్యాండ్స్ క్రమబద్ధీకరణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో గత ఆరు నెలల్లో 22ఏ, డాటెడ్ ల్యాండ్స్‌కు సంబంధించి 964 ఎకరాల 97 సెంట్ల భూమికి పరిష్కారం కల్పించగా, 367 మంది రైతులకు లబ్ధి చేకూరిందని కలెక్టర్ తెలిపారు. నంద్యాల డివిజన్‌లో 189 మంది రైతులకు చెందిన 499 ఎకరాలు, ఆత్మకూరు డివిజన్‌లో 115 మందికి చెందిన 245 ఎకరాలు, బనగానపల్లె డివిజన్‌లో 33 మందికి చెందిన 135 ఎకరాలు, డోన్ డివిజన్‌లో 30 మందికి చెందిన 87.63 ఎకరాల భూములకు పరిష్కారం చూపినట్లు వివరించారు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వెబ్‌ల్యాండ్ వివరాల కాపీలను ప్రొసీడింగ్స్‌తో పాటు అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనవసర పత్రాలు అడిగి రైతులను ఇబ్బంది పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ, 22ఏ భూముల తొలగింపులో రైతులపై అనవసర పత్రాల భారం మోపవద్దని సూచించారు. ఆర్ఓఆర్, మ్యుటేషన్, పొసెషన్‌కు సంబంధించిన సక్రమమైన రికార్డుల ఆధారంగా దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. జీఓ-44 ప్రకారం కొన్ని భూ సమస్యల పరిష్కార అధికారాలను ఆర్డీఓలకు వికేంద్రీకరించినట్లు వెల్లడించారు.



# వినాయక ఉత్సవాలకు నిబంధనలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , సెప్టెంబర్ 7: వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించేవారు తప్పనిసరిగా ముందస్తు పోలీసు అనుమతి పొందాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ సూచించారు. అనుమతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత ఏకగవాక్ష విధానంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మండపాల ఏర్పాటుకు కనీసం ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేసి సభ్యుల వివరాలు, గుర్తింపు కార్డుల ప్రతులను పోలీసులకు అందజేయాలని సూచించారు. ప్రైవేటు స్థలాల్లో స్థల యజమాని, ప్రభుత్వ స్థలాల్లో పంచాయతీ లేదా మున్సిపల్ అనుమతి తప్పనిసరన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకుని, ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. మండపాలు రోడ్లపై ఏర్పాటు చేసి ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగించరాదని, ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ధ్వని పరికరాలు వినియోగించాలని తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా అధిక శబ్దంతో కూడిన వాయిద్యాలు, బాణసంచా వినియోగించరాదన్నారు. నిమజ్జనానికి మంచి స్థితిలో ఉన్న వాహనాలను, అనుభవజ్ఞులైన డ్రైవర్లను మాత్రమే వినియోగించాలని, మద్యం సేవించిన వారు, మైనర్లు నిమజ్జన వాహనాల్లో ఉండరాదని సూచించారు. ఊరేగింపు, నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారుసామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకుండా, పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలని ఎస్పీ సునీల్ షొరాణ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# నంద్యాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 07-నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్ఆర్జీ చెస్ అకాడమీ నిర్వహణలో ఈ నెల 12న నంద్యాల టెక్కేలోని నెరవాటి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. 12 వివిధ వయసు విభాగాల్లో పోటీలు నిర్వహించి, ప్రతి విభాగంలో 10 చొప్పున మొత్తం 120 బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 9వ తేదీ సాయంత్రంలోపు ఏపీ చెస్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9010451585, 9573661799 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



# కన్నుల పండుగగా అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం..

## విజయవాడకు ఐదు రాష్ట్రాల నుండి భారీగా తరలివచ్చిన అయ్యప్ప భక్తులు..

విభారే న్యూస్ సెప్టెంబర్ 7 ఎమ్మిగనూరు..ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప అన్నదాన ప్రభువే శరణమయ్యప్ప అయ్యప్ప భక్తి ఆధ్యాత్మిక సేవ కు ప్రత్యేకగా అఖిలభారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం విజయవాడలో ఘనంగా నిర్వహణ ఐదు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన అయ్యప్ప భక్తులు. విజయవాడ సెప్టెంబర్ ఆదివారం రోజు స్వామియే శరణమయ్యప్ప అనే భక్తి నినాదాలతో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది అఖిలభారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. అయ్యప్ప స్వామి అనుగ్రహంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ కర్ణాటక చత్తీస్గడ్ ఒడిస్సా రాష్ట్రాల నుంచి అయ్యప్ప గురు స్వాములు కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు ఈ సందర్భంగాఅయ్యప్ప స్వామి వారి భక్తి ధర్మ ప్రచారం గురుస్వాముల మార్గదర్శకత్వం సేవా కార్యక్రమాల ప్రాధాన్యత గురించి భక్తులకు వివరించారు ముఖ్యంగా శబరిమల పవిత్ర సన్నిధానంలో ప్రతి నెల నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమం గురించి విస్తృతంగా వివరించడం జరిగింది. అన్నదానం మహాదానం అనే సనాతన ధర్మ స్ఫూర్తిని శబరిమల చేరుకునే అయ్యప్ప స్వామి భక్తులకు అన్నప్రసాదం అందించడం ఒక గొప్ప సేవా కార్యక్రమాన్ని ట్రస్ట్ సభ్యులు తెలిపినారు ఈ మహా అన్నదాన కార్యక్రమానికి ప్రతి అయ్యప్ప భక్తుడు తన కు సాధ్యమైన విధంగా ధన రూపంలో వస్తు రూపంలో లేక సేవ రూపంలో సహకరించి స్వామివారి సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ జిల్లాలలో ట్రస్టు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు నూతన కార్యవర్గాలను ఎన్నుకోవడం జరిగింది. నూతన కార్యవర్గ సభ్యులు చేయాలని సూచించారు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి సభ్యుణ్ణి ఘనంగా సత్కరించి వారి సేవలను అభినందించారు. భవిష్యత్తులో ట్రస్ట్ చేపట్టాల్సిన ఆధ్యాత్మిక ధార్మిక, సేవా కార్యక్రమాలపై సభ్యుల అమూల్యమైన సలహాలు సూచనలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవాధ్యక్షులు పిట్టా హరి,రుద్ర కోటేశ్వరరావు అధ్యక్షులు పైలా ఆది మోహన్ రెడ్డిట్రస్ట్ జనరల్ సెక్రెటరీ కర్నాసిద్దుట్రెజరర్ ఈశ్వర్ సభ్యులు అనంతరావు వైకుంఠ రావు తదితరులతోపాటు బొంబాయి గురుస్వామి వెల్ది నాగరాజు గురుస్వామి బొబ్బర్ల సురేష్ గురు స్వామి ఢిల్లీ గురుస్వామి,గురుస్వామి - డోన్ తదితరులు పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఇట్టి కార్యక్రమంలో భాగంగా ఐదు రాష్ట్రాలకు గాను భద్రాద్రి జిల్లా బ్రాంచ్ టీమ్ను ఆదర్శంగా తీసుకుని సేవే లక్ష్యం సేవే మార్గం అనే నినాదంతో ప్రతి రాష్ట్రంలో ప్రతి ఏరియాలో అయ్యప్ప భక్తులు గురు స్వాములు సేవా కార్యక్రమాల్లో పాల్గొనగలరని ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి సేవే పరమ ధర్మంగా భావించి భక్తి ధర్మం సేవ అనే మూడు మార్గాల్లో ఫస్ట్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడమే తమ లక్ష్యమని తెలిపినారు శబరిమలలో జరుగుతున్న మహా అన్నదాన కార్యక్రమం తో పాటు భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక ధార్మిక సేవా కార్యక్రమాలను చేపట్టి అయ్యప్ప భక్తులందరినీ ఏకతాటి పైకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190